# బాంబు భయం

కె.వి.ఎస్.వర్మ

"లేచింది మహిళాలోకం, దద్దరిల్లింది పురుష ప్రపంచం" అంటూ కొటేషన్‌రావు పాడాడు.

"కథల్రాజా, ఇప్పుడు మన పరిస్థితి ఏవిటి" అన్నాడు కవికుమారుడు గోదావరి వంక చూస్తూ.

"నువ్వు అనేదేవటో కొన్ని కవితల్లా నాకర్థం కాలేదు"

"ఇన్నాళ్ల నుంచి రాస్తున్నాం కదా. ఇప్పుడేవో ఇజాలే రాజ్యమేలుతున్నాయి..."

"ఇంతకముందూ ఇజాలున్నాయి కదా"

"అది నిజమేనుకోండి. ఈమధ్య ఫెమినిజం, దళితవాదం అంటూ రాస్తున్నారు కదా అని మన కవికుమారుల భావం అనుకుంటా" అన్నాడు మధ్యలో కల్పించుకుంటూ శాస్త్రి.

"అది సరేకానీ, నీ బాధేవిటో చెప్పు"

"సాహితీ విలువలు లేకపోయినా ఫెమినిస్టు దళిత కవితో, కథో రాసి ప్రముఖ రచయితలయి పోతున్నారు కొందరు"

"నువ్వూరాయి. ఎవరొద్దన్నారు"

"ఒకరు రాయమంటే రాయడం, మానెయ్యమంటే మానెయ్యడం మనకు అలవాటు లేదు కదా"

"మరింకేం, ఊరుకో"

"కవిగా ఎలా వూరుకోగలను"

"కవికుమారా, మనం ఇంతకు ముందు ఈ ఉద్యమాలు రాకపోయినా, మనం రాసేదేదో రాశాం. ఆ రాసినవాటిలో ఫెమినిస్టు రచనలూ, దళిత రచనలూ వుండి వుండవచ్చు. అవెలా రాశాం? మానవుల మీద ప్రేమతోను ఈ వ్యవస్థ మీద కోపంతోనూ రాశాం. ఇప్పుడూ అదే చేయాలి"

"ఏవిటో నాకంతా గందరగోళంగా వుంది"

"ఇందులో గందరగోళం ఏముంది? నా వరకూ నేను ఇంతకు ముందెలా స్పందించి రాశానో, ఇక ముందూ అలాగే రాస్తాను"

"ఆ స్పందనలేకే అనుకుంటాను ఇప్పటి ఆ రెండు ఉద్యమరచనల్లోనూ రీజనింగ్, వాస్తవికత కనిపించడం లేదు"

"ఉద్యమాల ప్రారంభంలో అలాంటి కొన్ని రచనలు రావడం సాధారణమే. మంచివి కూడా వస్తున్నాయి కదా" అన్నాడు కథల్రాజు.

ఆమాట కవికుమారునికి నచ్చినట్టులేదు. గోదావరి వంక తలతిప్పి, గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడు.

మిగతా మిత్రులు ఆవిషయాలు తెలియక నోరు విప్పలేదు. .

అలా అయిదు నిమిషాలు గడిచిపోయాయి.

"మౌనమేలనోయి" అంటూ కొటేషన్‌రావు పాటందుకున్నాడు.

ఆ పాటయ్యేక ఇక లాభం లేదని కథల్రాజు గొంతు సవరించుకున్నాడు.

"సంవత్సరం క్రితం ఆఫీసు పని మీద హైదరాబాద్ వెళ్లేను. ఆ పగలంతా ఆఫీసుపనిచూసుకుని లాడ్జికొచ్చాను. ఆరాత్రి గౌతమికి టిక్కెట్ సంపాదించమని మా ఫ్రెండ్ రఘుకి చెప్పాను. ముఖం కదుక్కుని, కుర్చీలో రిలాక్సయి, వాడి కోసం చూస్తున్నాను. అయిదున్నరకల్లా వచ్చాడు. ఏం తెప్పించనని అడిగాను. బ్లూరిబన్‌జిన్ తెప్పించమన్నాడు. ఓహాఫ్ తెప్పించాను. అందులో లిమ్కా కలుపుకుని కబుర్లు చెప్పుకుంటూ తాగాం. ఆరుంపావుకదయిపోయింది. రఘు పర్సు తీసి, బోయ్‌కి డబ్బులిచ్చి మరో హాఫ్ తెప్పించాడు.

టైమ్ ఎంతో లేదు కదా అంటూ నసుగుతూనే నేను హడావుడిగా తాగడం మొదలెట్టాను.


"మరీ ఎక్కువగా డ్రింక్ చేస్తున్నాం" అన్నాను.

"బలేవాడివే. ఇది ఆడాళ్ల డ్రింక్" అన్నాడు రఘు ఆఖరి పెగ్‌పోస్తూ.

రూమ్‌బోయ్ చపాతీలు తెచ్చాడు. గబగబా తిన్నాం. రూము ఖాళీ చేసి, ఆటో ఎక్కాను. ఏడయ్యింది.

"మళ్లీ వచ్చినప్పుడు ఫోన్ చెయ్యి" అంటూ రఘు పంజాగుట్ట వైపు కెళ్లిపోయాడు.

ఆటో టాంక్ బండ్ మీద కెళ్లే ముందు ట్రాఫిక్‌జామ్ అయిపోయింది. ఓపదినిమిషాలకి కానీ ఆటో కదలలేదు. త్వరగా పోనీయ్ అని డ్రైవర్‌కి చెప్పాను. స్టేషన్లో దిగి, ఆటో వాడికి పాతిక రూపాయలిచ్చి, ప్లాట్‌ఫారం మీదకు నడిచాను.




"గౌతమి ఏప్లాట్ ఫారం షార్" అని అక్కడున్న టి.సి.ని అడిగాను.

"గౌతమి అయిదు నిమిషాల క్రితమే వెళ్లిపోయింది" అన్నాడు.

"అదేంటీ అప్పుడే" అనుకుంటూ వాచీ చూసుకున్నాను.

ఏడుముప్పై అయిదయింది. గౌతమి సాధారణంగా పావుతక్కువ ఎనిమిదికో, ఎనిమిదికో బయల్దేరేది. అలాంటిదావేళ టైమ్కకెళ్లిపోయింది.

జేబులో డబ్బులు చూసుకున్నాను. ఇరవైరూపాయలున్నాయి. నన్ను మత్తు ఆవరిస్తోంది. జాగ్రత్తగా అడుగులేస్తూ ఓ కౌంటర్ దగ్గరికెళ్లి సూట్‌కేసు పక్కన నేలమీద పెట్టి, టికెట్ కేన్సిల్ చెయ్యాలని అడిగాను. ఇక్కడ కాదు, అటువైపు కౌంటర్ కెళ్లమన్నాడు. అక్కడికెళ్లి టిక్కెట్ కేన్సిల్ చేసుకుని, అతనిచ్చిన డబ్బులు తీసుకుని సూటుకేసువంక చూశాను, లేదు. మొదటెళ్లిన కౌంటర్ దగ్గరకి గబగబా వెళ్లాను. అక్కడా లేదు. మళ్లీ ఇటు వైపు వచ్చి చూశాను. లేదు. బుర్ర గిర్రున తిరుగుతోంది. ప్లాట్‌ఫారం మీద కానీ వదిలేశానేమోననిపించింది. ప్లాట్‌ఫారం ఆచివరినుంచి ఈ చివరిదాకా అటూఇటూ తిరిగి చూశాను. ఎక్కడా లేదు.

అప్పటికి తొమ్మిది దాటింది. ఏబస్సు మీదయినా వెళ్దామంటే సరిపడినన్ని డబ్బులు లేవు. మరి సూటు కేసో? ఓ పోలీసు కన్పిస్తే నా సూటుకేసు గురించి చెప్పాను. ఏరంగుదో అడిగాడు. ఫలానా రంగుదని, విఐపి సూటుకేసని చెప్పాను.

'ఇందాకా మా వాళ్లు తీసి పోలీస్‌స్టేషన్లో పెట్టారు. ఇప్పుడెవరూ వుండరు. రేపొద్దున్న తీసుకెళ్లండి' అన్నాడు పోలీసు.

మా రఘుకు ఫోన్ చేద్దామంటే వాడింటికి ఫోన్ లేదు.

'అప్పటిదాకా ఎక్కడుండను అన్నాను' అమాయకంగా.

వెయిటింగ్ రూం చూపించి, అతనెళ్లిపోయాడు. అక్కడికెళ్లి కాస్త ఖాళీ చూసుకుని నేలమీద నడుం వాల్చాను.

తెల్లవారేక మెలకువ వచ్చింది. వాష్‌బేసిన్ దగ్గరకెళ్లి, చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని, ప్లాట్‌ఫారం మీదకి వెళ్లాను. కాస్తదూరం నడిస్తే, పోలీస్ స్టేషన్ కనిపించింది. సూటుకేసు గురించి అడిగాను. తొమ్మిది గంటలకు కానీ ఎస్.ఐ. రాడని ,అతనొస్తే కానీ ఇవ్వననీ అక్కడి కానిస్టేబుల్ చెప్పాడు.

టిఫెన్ చేసి, కాఫీ తాగి, పేపరుకొని చదువుతూ కూర్చున్నాను. ఎస్.ఐ. పదయినా రాలేదు. రఘు ఆఫీసుకి ఫోన్ చేసి, విషయం చెప్పాను. వెంటనే బయల్దేరి వస్తానన్నాడు.

కాసేపటికి ఎస్.ఐ. వచ్చాడు. విషయం చెప్పాను. నా వంకోసారి చూసి,

"దారికడ్డంగా సూట్‌కేసు పెట్టి ఎక్కడికి పోయారు? అందులో బాంబువుందేమోనని భయపడ్డాం. అందుకే జాగ్రత్తగా పట్టికెళ్లి చెక్ చేశాం. లేదని తెలిసి వూపిరి పీల్చుకున్నాం. మీ వస్తువులన్నీ వున్నాయో లేదో చూసుకోండి" అన్నాడు సూటుకేసు ఇస్తూ.

అన్నీ వున్నాయి. థాంక్స్ చెప్పి, పోలీసులు అప్రమత్తంగా వుండడం కూడా ఒకోసారి ఇబ్బందేననుకుంటూ స్టేషన్ బయటికొచ్చి రఘు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను.

పదకొండింటికి వాడొచ్చాడు. వాడి దగ్గర డబ్బులు తీసుకుని బస్సెక్కి వచ్చాను" అంటూ కథల్రాజు మావంక చూశాడు.

"అందమైన అనుభవం"అన్నాడు కవికుమారుడు వెటకారంగా నవ్వుతూ.

"ఇలాంటిదేదో ఇక్కడే ఎప్పుడో విన్నట్టుంది" అన్నాడు వాసు నసుగుతూ.

"నువ్వు క్షణక్షణంలోని శ్రీదేవిని కాపీ కొడుతున్నట్టుంది" అంటూ పకపకనవ్వి,

"అలా అనిపించడం సహజమే. కవికుమారుడి స్కూటర్ అనుభవం, జగదీష్ లేట్‌మాస్టర్ అనుభవం కలిపి, ఈ కథ కల్పించాను"అన్నాడు కథల్రాజు.

"మొత్తం మీద సార్థకనామధేయుడు అనిపించావ్" అన్నాడు శాస్త్రీ నవ్వుతూ.

గౌతమి చప్పుడు వినిపించింది.

అందరూ ఇళ్లకు బయల్దేరారు.

కొటేషన్‌రావు ఆలోచిస్తూ అన్నాడు,

**"కల్పితమో అసంకల్పితమో...**
**ముందుపాతరవంటిదే ముందు జాతర"**

**(వచ్చే వారం : యాత్ర)**